క్లుప్తంగా...

సన్మానం



చార్మినార్: ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ మంగళవారం బాధ్యతలు చేపట్టనున్న సందర్భంగా మజ్లిస్ పార్టీ నాయకులు రాజేశ్వరవర్మ, దిపేశ్ రాజ్ వర్మ తదితరులు ఆయనను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

అన్నదానం



అబిడ్స్: మెహిదీనవాబ్ జంగ్ కేన్సర్ ఆస్పత్రి వద్ద రోగుల సహాయకులకు అన్నదానం నిర్వహించారు. టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, అసద్ అన్వర్ మెమోరియల్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. దాదాపు 600 మంది రోగుల సహాయకులకు పౌష్టికాహారం, భోజనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేఆర్.రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, అబ్దుల్ ముజీబ్, బి.శివకుమార్, ముస్తఫా, శంకర్ పాల్గొన్నారు.

జల విశ్లేషణపై సర్టిఫికెట్ కోర్సు

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాలలో సోమవారం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఒకరోజు 'జలం-రసాయన విశ్లేషణ' అనే అంశంపై సర్టిఫికెట్ కోర్సును నిర్వహించారు. భూగోళంపై ప్రాణమున్న ప్రతి జీవి నీటిని పొదుపుగా వాడుకోవడమే కాదు.. ప్రతి బొట్టునూ ఒడిసిపడితేనే భవిష్యత్తు తరాల మనుగడ సాగించే అవకాశముంటుంది. ఈ ప్రారంభ సదస్సులో ప్రధాన వక్తగా సిరిసిల్ల పాలిటెక్నిక్ కాలేజీ అధ్యాపకుడు పోతూరి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో శాఖాధ్యక్షులు డాక్టర్ యాదయ్య, డాక్టర్ విప్లవ్ దత్ శుక్లా, డాక్టర్ దయానంద్, వసంత, అనిల్ బుస్సి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నవ్యనాటక సమితి 65వ వార్షికోత్సవాలు



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న పద్మజారెడ్డి

సుల్తాన్‌బజార్: నవ్యనాటక సమితి 65వ వార్షికోత్సవాల ముగింపు ఉత్సవాలు సోమవారం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయంలో ముగిశాయి. ఈ ఉత్సవాలకు ప్రముఖ నర్తకి పద్మశ్రీ డాక్టర్ పద్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణా శిబిరంలో పాల్గొన్న నృత్య గురువులకు, యువ కళాకారులకు ప్రశంసా పత్రాలను అందజేసి వారిని అభినందించారు. ఈ శిక్షణా శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన నృత్య గురువు బాగవతుల సేతూరామ్‌ను సైతం సంస్థ పక్షాన సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మజా రెడ్డి మాట్లాడుతూ.. భారతీయ సంగీత శాస్త్రీయ నృత్యాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో వసుంధర, విజయ్‌కుమార్‌తో పాటు పెద్ద ఎత్తున కళాకారులు పాల్గొన్నారు.

మైదానం పరిశీలన



గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 10, 11, 12వ తేదీల్లో నిర్వహించనున్న ఖేలో ఇండియా బచావో భాగ్యనగర్ స్పోర్ట్స్ వాలీబాల్ గేమ్ సందర్భంగా సోమవారం బీజేపీ నాయకులు మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న వాలీబాల్ పోటీల్లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు బీజేపీ నాయకులను సంప్రదించి తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, బీజేపీ నాయకులు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, ఆలే భాస్కర్ రాజు, ఆలే జితేంద్ర, ఆదర్ల మహేశ్, ధీరజ్‌లాల్, ఎం.కుమార్, పాగా రాజేశ్వర్, జమాల్‌పూర్ అశోక్, కొాడి మహేందర్, పెండం లక్ష్మణ్, ఎ.శివచంద్ర గిరి, జగన్, సుమన్ కుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



అబిడ్స్: కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాంధీభవన్ నుంచి భారీ ప్రదర్శనగా సరూర్‌నగర్ వరకు ప్రియాంకగాంధీ సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమన్నారు. అన్నివర్గాల ప్రజలు, యువత, నిరుద్యోగులు, మహిళలు ప్రియాంకగాంధీ రాకతో కాంగ్రెస్ వైపే మళ్లారన్నారు.

మురుగు పరుగు.. పరిష్కారం దేవుడెరుగు!

- జియాగూడ రహదారిలో పారుతున్న మురుగునీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

జియాగూడ: జియాగూడ రహదారిలో మురుగునీరు ఏరులై పారుతూ అటుగా రాకపోకలు సాగించే వారికి దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సబ్జిమండి గుర్రంబావి చౌరస్తా వద్ద పొంగిపొర్లే డ్రైనేజీ మురుగునీరు రంగనాథ దేవాలయం, దర్గా నుంచి భీమ్‌నగర్ చౌరస్తా వరకు ప్రధాన రహదారిపై పారుతుంది. తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నప్పటికీ శాశ్వతంగా చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎగువ ప్రాంతాలైన సబ్జిమండి, ముస్తాయిద్‌పురా, నీలకంటనగర్, 2జే బస్టాప్ ప్రాంతాల నుంచి మురుగునీరు గుర్రంబావి చౌరస్తా దర్గా వద్ద పొంగిపొర్లుతుంది.

మంత్రి హామీచ్చి ఆరు నెలలైనా..

- గతంలో ఇక్కడ కచ్చామోరీ, పైప్‌లైన్ వేసినప్పటికీ ఓవర్‌లోడ్ కారణంగా ప్రతిరోజూ పొంగుతుంది. దీంతో ప్రయాణికులు, దేవాలయాలు, దర్గాలకు వెళ్లేవారు నానా ఇబ్బందులు పడుతున్నారు.
- గతేడాది డిసెంబర్‌లో జరిగిన వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు హాజరైన మంత్రి తలసాని ఉత్సవాలు పూర్తయిన వెంటనే శాశ్వత పరిష్కారం చేపడుతామని చెప్పి ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు పనులే ప్రారంభం కాలేదు.
- స్థానిక ఎమ్మెల్యే జియాగూడ ప్రాంత సమస్యల పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.



జియాగూడ రంగనాథ దేవస్థానం రహదారిలో పారుతున్న మురుగు



దర్గా గోడ పక్కన..

ఉన్నతాధికారులు స్పందించాలి..



జియాగూడ ప్రధాన రోడ్డులో గల డ్రైనేజీ సమస్య గత కొన్ని సంవత్సరాల నుంచి నెలకొంది. శాశ్వతంగా పరిష్కరించడంలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారు. ఇక్కడి రంగనాథ దేవాలయానికి వచ్చే భక్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి తలసాని హామీ అటకెక్కింది. అధికారులు వెంటనే పరిష్కరించాలి. – మునేందర్, మాజీ కార్పొరేటర్

బోజగుట్ట బస్తీని అభివృద్ధి చేస్తా

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



కేంద్రమంత్రితో బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్, బోజగుట్ట వాసులు

గోల్కొండ: పేదల బస్తీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో గుడిమల్కాపూర్ డివిజన్ బోజగుట్ట బస్తీని అభివృద్ధి చేస్తానని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. బోజగుట్ట సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ ఆధ్వర్యంలో సోమవారం బోజగుట్ట వాసులు కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలిశారు. తమ బస్తీలో నేటికి ఇరుకైన రోడ్లపై మురుగు కాలువలా ప్రవహిస్తుందని, మహిళలు, పిల్లలు రోడ్డుపై నడవలేకపోతున్నారని వారు కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. బోజగుట్టలో తాను త్వరలోనే పర్యటించి సమస్యలు తెలుసుకుంటానని ఈ సందర్భంగా కేంద్రమంత్రి అన్నారు. బోజగుట్టకు అవసరమైన రోడ్లు, విద్యుత్ దీపాలు, డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశిస్తానని, ప్రతిపాదనలు అందిన వెంటనే నిధులు కేటాయించి పనులు వెంటనే ప్రారంభింపజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్ రావు, కార్యదర్శి భుజేందర్, దేవర శ్రీనివాస్, దేవర వంశీ, మహిపాల్‌సాగర్ తదితరులున్నారు.

తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయం



మరోసారి మోదీ సర్కార్ క్యాంపెయిన్‌లో బీజేపీ నాయకుడు అమర్ సింగ్ తదితరులు

గోల్కొండ: ఈసారి తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి. అమర్ సింగ్ అన్నారు. సోమవారం ఆయన గుడిమల్కాపూర్ డివిజన్‌లో కేంద్రంలో మరోసారి మోదీ సర్కార్-ఈసారి తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకుని బీజేపీకి ఓటు వేయాల్సిన అవసరాన్ని గురించి ప్రజలకు వివరించారు. ప్రధానిగా నరేంద్రమోదీ వచ్చిన తరువాత దేశ ప్రతిష్ఠత బాగా పెరిగిందని తమ దేశం అగ్రదేశాల సరసన నిలిచిందని ఆయన అన్నారు. తెలంగాణలో యువతకు భవిష్యత్తు లేకుండా పోయిందని, దీనికి కారణం బీఆర్ఎస్ ప్రభుత్వ అసమర్థతదే కారణమని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సునీల్‌యాదవ్ తదితరులున్నారు.

తెలంగాణ పోలీస్ శాఖ ఇతర రాష్ట్రాలకు ఆదర్శం



గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులతో కమిషనర్ సీవీ. ఆనంద్



నూతన భవనాన్ని సందర్శించిన సీపీ సీవీ ఆనంద్

గోల్కొండ: తెలంగాణ పోలీసుల పనితీరు ఇతర రాష్ట్రాల కంటే ఎంతో మెరుగ్గా ఉందని నగర కొత్వాల్ సీపీ ఆనంద్ అన్నారు. సోమవారం ఆయన ఇతర పోలీస్ అధికారులతో కలిసి గోల్కొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్‌స్టేషన్‌లో కలియతిరిగారు. లాకప్ రూం, రెస్ట్ రూంలతో పాటు తదితర ప్రాంతాల్లో ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రిసెప్షన్‌లో మహిళల ఫిర్యాదుల కోసం ప్రత్యేక కౌంటర్ ఉండటం చూసి ఆయన ఎస్‌హెచ్‌ఓను అభినందించారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు స్వీకరించి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం చేయకూడదని ఆయన సూచించారు. ఆయన వెంట ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధీర్ బాబు, సౌత్ వెస్ట్ డీసీపీ కిరణ్ ఖరే, ట్రాఫిక్ డీసీపీ అశోక్, ఏసీపీ శివమారుతి తదితరులున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారికి ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు.

త్వరలో కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ నూతన భవనం ప్రారంభం..

జియాగూడ: కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పక్కనే నూతనంగా నిర్మితమైన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ భవనాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. ఈ మేరకు సోమవారం నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న నూతన భవనాన్ని సీపీ సీవీ ఆనంద్‌తో పాటు సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే, గోషామహల్ ఏసీపీ సతీష్ కుమార్‌తో కలిసి భవనాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతన భవనం పనులు పూర్తయ్యాయని, కేవలం విద్యుత్, తాగునీటి సౌకర్యాల పనులు కొనసాగుతున్నాయని ఈ వారం రోజుల్లో పూర్తి అవుతాయన్నారు. త్వరలో ప్రారంభించే నూతన భవనంలోకి కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌ను తరలించడం జరుగుతుందన్నారు. పలు పోలీస్ విభాగాలకు చెందిన పోలీసులు, కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, ఎస్సై శేఖర్ తదితరులు ఉన్నారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సమీనాబేగం

యాకుత్‌పురా: ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిందేందుకు చర్యలు తీసుకుంటున్నామని తలాబ్ చంచలం కార్పొరేటర్ సమీనాబేగం అన్నారు. అమన్ నగర్-బి, అక్రంనగర్ ప్రాంతాల్లో నూతనంగా చేపట్టనున్న డ్రైనేజీ పైప్‌లైన్, నాలా విస్తరణ అభివృద్ధి పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బస్తీలలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కారించి అవసరమైన ప్రాంతాల్లో నూతన డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్, సీసీ రోడ్డు పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు షేక్ జఫర్, యుసుఫ్ మాలిక్, జీహెచ్ఎంసీ, జలమండలి విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నియామకం



నవరతన్ ఇందోరియా

జియాగూడ: రాజస్థాన్ బ్రాహ్మణులను తెలంగాణ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఆదుకోవాలని నూతనంగా రాష్ట్రీయ బ్రాహ్మణ్ ఏక్తా సంఘ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన నవరతన్ ఇందోరియా అన్నారు. ఈ మేరకు సోమవారం రాష్ట్రీయ బ్రాహ్మణ ఏక్తా సంఘ్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు అభిషేక్ దీక్షిత్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన జియాగూడలో మాట్లాడుతూ.. తెలంగాణలో రాజస్థాన్ బ్రాహ్మణులు జనాబా లెక్కల 10 శాతం ఉన్నారని కేసీఆర్ ప్రభుత్వం స్థలం కేటాయించి భవనానికి నిధులు మంజూరు చేయాలన్నారు. అలాగే బ్రాహ్మణ కులస్తుల కోసం గురుకుల్ పాఠశాలను కూడా నగరంలో పలు చోట్ల ఏర్పాటు చేయాలన్నారు.

ఉమ్మడి ఆలయాల ఉరేగింపు కమిటీ రెండవ ఉపాధ్యక్షుడిగా క్రాంతికుమార్



యాకుత్‌పురా: పాతనగర ఉమ్మడి ఆలయాల ఉరేగింపు కమిటీ రెండవ ఉపాధ్యక్షుడిగా ఎస్. పి. క్రాంతికుమార్ ఎన్నికయ్యారు. రోటేషన్ విధానంలో రెండవ ఉపాధ్యక్ష పదవి హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయ కమిటీకి కేటాయించడంతో ప్రస్తుతం ఆలయ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శిగా కొనసాగుతున్న క్రాంతికుమార్ పేరును ఆలయ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది ఉమ్మడి ఆలయాల కమిటీ ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన తన పేరును రెండవసారి ప్రతిపాదించిన ఆలయ కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సమస్యలను పరిష్కరిస్తాం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. గౌలిపురా డివిజన్‌లోని చాపలగల్లీలో సోమవారం ఆమె నాయకులతో కలిసి నూతన సీవరేజ్ పైప్‌లైన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీవరేజ్ పైప్ లైన్ పనులను రూ.12 లక్షల జలమండలి నిధులతో నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం కార్పొరేటర్లకు నిధులను కేటాయించకపోవడంతో డివిజన్‌లో పలు అభివృద్ధి, నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు వినోద్ కుమార్, ప్రభు, పెంటప్ప, సునీల్, సాయి కిశోర్, బీజేపీ నాయకులు రఘుకాంత్, సుమన్‌కుమార్‌ముదిరాజ్, అశోక్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పాలాభిషేకం



సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలోని ఏడు విభాగాల్లో 1331 మందిని క్రమబద్ధీకరిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని తెలంగాణ పబ్లిక్ అండ్ మెడికల్ హెచ్-1 యూనియన్ అధ్యక్షుడు కర్ణాటి సాయిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ముందు సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డీహెచ్ శ్రీనివాసరావు, ఆర్‌వీ మహేందర్, సంఘం సెక్రెటరి సుదర్శన్, జాయింట్ జనరల్ సెక్రెటరి అత్తాబ్, మహ్మద్‌ఖాన్, అజీజ్, రవీందర్, జనార్దన్, విజయ్‌పాల్‌రెడ్డి, ధినేష్కర్‌బాబు, మాధవి, సతీష్ పాల్గొన్నారు.

అన్నమయ్య కీర్తనలు ఎంతో మధురం



నృత్య గురువులను సన్మానిస్తున్న ఓలేటి పార్వతీశం తదితరులు

గన్‌ఫౌండ్రీ: తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనలు ఎంతో మధురమైనవని ప్రముఖ సాహితీవేత్త ఓలేటీ పార్వతీశం అన్నారు. సోమవారం రవీంద్ర భారతిలో భారత్ ఆర్ట్స్ అకాడమి, ఏబీసీ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్య 615వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నమయ్య రచనలపై నేటి యువతరానికి మక్కువ కల్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అనంతరం పలువురు నృత్య గురువులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు చిన్నారుల శాస్త్రీయ సంగీత నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏసీపీ తేజావత్ రామ్‌దాస్, కూచిపూడి నృత్య గురువు పద్మిని, సినీనటి ప్రశాంతి, నటుడు వైభవ్ సూర్య, భారత్ ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపకులు లయన్ రమణారావు, ఏబీసీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లలిత తదితరులు పాల్గొన్నారు.

షేక్‌పేట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



బల్దియా కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఫరాజ్

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి సహకరించాలని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యులు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన బల్దియా కమిషనర్ లోకేష్‌కుమార్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధి పనులు, తాను పంపిన ప్రతిపాదనల విషయంపై బల్దియా కమిషనర్‌తో చర్చించారు. షేక్‌పేట్ డివిజన్ నగరంలో ఎంతో ప్రాధాన్యత గల డివిజన్ అని, డివిజన్ పరిధిలో కమర్షియల్ కాంప్లెక్స్‌లతో పాటు ఎన్నో నివాస భవనాల నిర్మాణం జరుగుతుందన్నారు. మరోవైపు షేక్‌పేట్ డివిజన్ పరిధిలో ఎన్నో పాత బస్తీలు కూడా ఉన్నాయన్నారు. కాగా రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని ఈ సందర్భంగా ఆయన కమిషనర్‌ను కోరారు. షేక్‌పేట్ డివిజన్ పరిధిలోని ఎన్నో రోడ్లు నేటికీ విస్తరణకు నోచుకేలేదన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని బల్దియా కమిషనర్ హామీ ఇచ్చారు.

సమాచార హక్కు చట్టానికి కమిషనర్లను నియమించండి



మాట్లాడుతున్న వెంకటేష్ ముదిరాజ్

అబిడ్స్: సమాచార హక్కు చట్టానికి వెంటనే కమిషనర్లను నియమించాలని సమాచార హక్కుచట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యెలిగెండ్ల వెంకటేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎంతో విలువైన సమాచార హక్కు చట్ట కార్యాలయానికి కమిషనర్లు లేకపోవడంతో సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ఆయన ప్రశ్నించారు. సోమవారం ఎంజే మార్కెట్‌లోని సమాచార హక్కు చట్టం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి పౌరుడికి, ప్రతి ఒక్కరికి సమాచార హక్కు చట్టం ఎంతో ముఖ్యమన్నారు. ప్రభుత్వం ఈ శాఖకు కమిషనర్లను నియమించడంలో ఆలస్యం చేయడం దారుణమన్నారు. కమిషనర్లు లేనిదో ప్రజల సమస్యలు ఎలా పరిష్కరిస్తాయని ఆయన ప్రశ్నించారు. వెంటనే సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో సమాచార చట్టానికి పూర్తిస్థాయి కమిషనర్లను నియమించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను రెగ్యులరైజ్ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న యూనివర్సిటీ కాంట్రాక్ట్ లెక్చరర్స్

విజయనగర్‌కాలనీ: పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కష్టపడి పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమవారం మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ లెక్చరర్స్ బ్యానర్, ప్లకార్డులు చేతబట్టి తమ డిమాండ్‌ను తీర్చాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జేఏసీ ప్రతినిధులు రామేశ్వర్‌రావు, శ్రీధర్‌కుమార్, హర్షిత, హరీష్, జితేందర్ మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా విశ్వ విద్యాలయాలకు తాము నమ్మకంతో అందిస్తున్న సేవలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని అర్హతలు ఉన్న మాల్లో ప్రతిభకు లోటు లేదన్నారు. తమను రెగ్యులరైజ్ చేస్తామని గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన వాగ్దానాన్ని గుర్తు చేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

అబిడ్స్: పౌర సరఫరాల శాఖ, తూనికలు, కొలతల శాఖలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ అనిల్‌కుమార్‌కు ఉద్యోగ సంఘాల నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. రెండు శాఖల్లో ఉద్యోగుల సమస్యలను వేగవంతంగా పరిష్కారం చేయాలని తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేని, కార్యదర్శి విక్రమ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కమిషనర్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేసి సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ స్పందిస్తూ త్వరితగతిన ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, ఒమేర్‌ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, వైదిక్ శస్త్ర, ముఖీమ్ ఖురేషి, సాయన్న, శివకుమార్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నూతన అధ్యక్ష, కార్యదర్శులకు సత్కారం



కేంద్ర సంఘం నేతలను సత్కరిస్తున్న శ్రీరామ్, శ్రీకాంత్

నాంపల్లి: ఇటీవల నూతనంగా ఎన్నికైన టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులను నగర శాఖ ఆధ్వర్యంలో సత్కారించారు. ఈ మేరకు నాంపల్లిలోని కేంద్ర సంఘం రాష్ట్ర కార్యాలయంలో నగర శాఖ అధ్యక్షుడు శ్రీరామ్, కార్యదర్శి శ్రీకాంత్‌ల నేతృత్వంలో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి ఎం.జగదీష్‌లకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నగర శాఖ కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

మానవీయ విలువలు బోధించేదే ఉత్తమ సాహిత్యం



మాట్లాడుతున్న ఆచార్య అనుమాండ్ల భూమయ్య

చార్మినార్: మానవీయ విలువలు బోధించేదే ఉత్తమ సాహిత్యమని ప్రముఖ సాహితీవేత్త, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్య అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో సోమవారం 'మకర హృదయం' కావ్యం అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవి బలహీనుల పక్షాన నిలబడి వారి మూగ వేదనకు అక్షరూపం ఇవ్వాలన్నారు. పర్యావరణ పరిరక్షణ సోయితో బడుగు జనుల చైతన్య స్ఫూర్తితో సమకాలీన దృక్పథంతో మకర హృదయం కావ్యాన్ని రాశానని భూమయ్య విశ్లేషించారు. శత వసంతాల ఘన చరిత్ర కలిగిన సిటీ కళాశాలలో అద్భుతమైన విద్యాత్మక వాతావరణం ఉందన్నారు. ఈ సదస్సులో ప్రధాన వక్తగా పాల్గొన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు, మూసీ పత్రిక సంపాదకులు ఆచార్య సాగి కమలాకర శర్మ మాట్లాడుతూ.. గుణ సౌందర్యమే ఉన్నతమైన సౌందర్యమన్నారు. సభ్యకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ.. పాఠ్యాంశంలోని సమున్నత విలువలను అందిపుచ్చుకొని విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ కోయి కోటేశ్వర్ రావు, డాక్టర్ జె.నీరజా, అవధానం సుజాత, కేథరీనా, అజ్మీరా సుజాత, డాక్టర్ కమల సుధారాణి తదితరులు పాల్గొన్నారు.